ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలి

చైతన్యపురి: ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని మలక్‌పేట ఎస్‌ఐ గంగాధర్ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్-2 డిపోలో బుధవారం డ్రైవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ డ్రైవర్లుగా ఎంపికైన వారిని ఘనంగా సత్కరించారు. ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ, ప్రయాణికును సురక్షితంగా గమ్యానికి చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని అన్నారు. డిపో మేనేజర్ కృష్ణమూర్తి, ఎంఎఫ్ శివశంకర్, అసిస్టెంట్ మేనేజర్ ఉషారాణి, ఉమాపతి, ఏఎస్‌ఐ మనోహర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత అంతర్ముఖ యోగా శిక్షణ తరగతులు

చైతన్యపురి: శ్రీసత్య సాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో గురువారం నుంచి ఉచితంగా అంతర్ముఖ యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ప్రముఖ యోగా గురువు ఇస్మాయిల్ తెలిపారు. 30 ఏళ్లుగా యోగ శిక్షణ ఇస్తున్న భిక్షమయ్య గురువుచే దిల్‌సుఖ్‌నగర్ సాయి బాబా రోడ్డులోని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం మహిళా వ్యక్తిత్వ వికాస యోగా శిక్షణ ఉంటుందన్నారు. అంతర్ముఖ యోగా శిక్షణలో ధ్యానం, సమాధి, నేర్పిస్తామన్నారు.

ప్రణాళికలకే రోడ్ల విస్తరణ పరిమితం

- ముందుకు సాగని నాగోలు చౌరస్తా నుంచి ఔటర్ రింగ్ వరకూ రోడ్డు విస్తరణ పనులు
- ఆనంద్‌నగర్ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్‌తో సతమతం
- పట్టించుకోని అధికారులు


ఆనంద్‌నగర్ చౌరస్తాలో రోడ్డు విస్తరణ లేక నిలిచిన ట్రాఫిక్


బండ్లగూడ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్

నాగోలు: నగరంలో రోజు రోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారులను విస్తరించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు గతంలో అనేక ప్రణాళికలు రూపొందించారు. అయితే, ఎక్కడా ఇవి అమలు కాలేదు. దీంతో ప్రజలు సరైన రోడ్డు సదుపాయం లేక రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. నాగోలులోని రోడ్లే ఇందుకు నిదర్శనం.

- హయత్‌నగర్ సర్కిల్ పరిధి నాగోలు డివిజన్‌లోని నాగోలు చౌరస్తా నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న రేడియల్ రోడ్డును 120 ఫీట్లకు విస్తరించేందుకు అధికారులు గతంలో ప్రణాళికలు రూపొందించి రూట్ మ్యాప్ వేసి కొంత మేర పనులు చేపట్టారు. అయితే, ఈ పనులు రెండేళ్లుగా 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. రోడ్డు విస్తరణ లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- రోడ్డు విస్తరణ లేక బండ్లగూడ చౌరస్తా, ఆనంద్‌నగర్ చౌరస్తా, తట్టిఅన్నారం చౌరస్తాల్లో నిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.
- బండ్లగూడ చౌరస్తా, ఆనంద్‌నగర్ చౌరస్తాలో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో గంటల కొద్దీ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ విషయంపై స్థానికులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆనంద్‌నగర్‌లో ఫ్లైఓవర్ నిర్మాణం కోసం ప్రతి ప్రతిపాదనలు చేశామన్నారు.
- ఆనంద్‌నగర్‌లో త్వరగా ఫ్లైఓవర్ నిర్మాణం చేసి ట్రాఫిక్ నుంచి విముక్తి కలిగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు, ప్రతినిధులు స్పందించి నాగోలు నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాలకు నిలయంగా రేడియల్ రోడ్డు...

నాగోలు నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న రేడియల్ రోడ్డు చిన్నగా ఉండటంతో వాహనల రద్దీ పెరగడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుపై ప్రతి రోజూ కాలేజీ, స్కూల్ బస్సులు, ఇసుక లారీలు, కంకర లారీలు, రెడ్‌మిక్స్ వాహనాలు తిరగడంతో నిత్యం ప్రమాదాలు జరుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టించుకోని పోలీసులు..

ఆనంద్‌నగర్ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అక్కడ ఉన్న ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకుండా ఆ దారిలో పోయే వాహనాలను నిలిపి చలాన్లు వసూలు చేస్తున్నారు. ఈ విషయంపై ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ఆనంద్‌నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాండించిన ధీరుడు నేతాజీ

నాగోలు: బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ధీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని జైపురికాలనీ నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యుడు లక్ష్మణ్‌గౌడ్, ప్రమోద్‌గౌడ్, మిట్టురాజు అన్నారు. కాలనీలో మంగళవారం రాత్రి నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఆర్గనైజర్ భాస్కర్‌రెడ్డి, యాదిలాల్, సతీష్, శంకర్, అరుణ్, భాను, సురేందర్ పాల్గొన్నారు.

వర్ధయ్య కాలనీలోని సమస్యలు పరిష్కరిస్తా..


వర్ధయ్య కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

లింగోజిగూడ: కాలనీలో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ క‌ళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వర్ధయ్య కాలనీ వాసులు విజ్ఞప్తి మేరకు బుధవారం ఆయన కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనకు పలు సమస్యలు ఏకరు పెట్టారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీవాసుల తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై అధికారులతో సమీక్షించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు వర్ధరాజ్, నాయకులు వెంకట్ రెడ్డి, వెంకట్‌చారి, వెంకటేశ్వర రావు, ఖయ్యూం, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మన్సూరాబాద్: మన్సూరాబాద్ గ్రామ సర్వే నంబర్ 5లో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా నిర్మాణం చేస్తున్నారని స్థానికులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్థానిక బీజేపీ సీనియర్ నేత పాతూరి శ్రీధర్‌గౌడ్ మన్సూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, మన్సూరాబాద్ గ్రామ సర్వే నంబర్ 5లో ఓ మహిళ తప్పుడు పత్రాలతో సుమారు 200 గజాల స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా నిర్మాణం చేపడుతుందన్నారు. రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ఈ విషయమై సరూర్‌నగర్ మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా విషయమై సమగ్ర విచారణ చేసి కబ్జాదారులతో పాటు వారికి సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో కాసాని అశోక్, హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

అధికారులకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆదేశం


పెండింగ్ పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్: అభివృద్ధి పనులపై అలసత్వం తగదని, పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదేశించారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని క్రిస్ట విల్లాస్ వద్ద నూతనంగా నిర్మించే వరదనీటి కాలువ పనులపై బుధవారం ఆయన జలమండలి, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, సాగర్ కాంప్లెక్స్ నుంచి గుర్రంగూడ అటవీ ప్రాంతం మీదుగా పాపిరెడ్డి కాలనీ కమాన్ వరకు వరద నీటి కాలువ పనులు పూర్తయ్యాయని తెలిపారు. పాపిరెడ్డి కాలనీ నుంచి దిగువ ప్రాంతం మునగనూర్ వరకు నిర్మించే వరద కాలువ పనులపై సన్నాహాలు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.వరద నీటి కాలువ పనులు సకాలంలో పూర్తయితే చుట్టు పక్క కాలనీలకు ముంపు నుంచి పూర్తి స్థాయిలో విముక్తి లభిస్తుందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే ప్రధాన సమస్యలు పరిష్కరించామని, మిగతా సమస్యలను కూడా ప్రణాళికబద్ధంగా పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ పవన్, జలమండలి మేనేజర్ సిరివెన్నెల , బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, వివిధ మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో ఈ దిగువ తెలిపిన ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు.

- **ఉదయం 9 నుంచి 11 గంటల వరకు...** ఆనంద్ నగర్, మలక్‌పేట, ప్రొఫెసర్ కాలనీ, హనుమాన్ టెంపుల్, డీమార్ట్, చర్మాస్ పరిసర ప్రాంతాలు.
- **ఉ.11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు...** దిల్‌కుషా ఫంక్షన్‌హాల్, ఫైర్ స్టేషన్, ఆఫీసర్ మెస్, ఆర్యసమాజ్, అమీర్ ఫాతిమా మాస్క్, రామాలయం టెంపుల్, అక్బర్‌బాగ్ క్రాస్ రోడ్స్, దయానంద్ నగర్ పరిసర ప్రాంతాలు.
- **మ. 2 నుంచి సా. 4 గంటల వరకు...** ఏకలవ్య నగర్, సైదాబాద్ మెయిన్‌రోడ్, పూసలబస్తీ, రెడ్డిబస్తీ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని అధికారులు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి


వికసిత్ భారత్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా బుధవారం డివిజన్‌లోని బాలదానమ్మ బస్తీ గ్రౌండ్స్‌లో కేంద్ర పథకాల సింగిల్ విండో కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముద్రలోన్, పీఎం ఉజ్వల్ యోజన, ఆధార్ మార్పులు, చేర్పులు, పీఎం ఆవాజ్ యోజన, పీఎం స్వయం నిధి యోజన, జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, హెల్త్ చెకప్‌లు, ఆయుష్మాన్ భారత్ యోజన, టీబీ అవేర్నెస్ కల్పించి.. వాటికి సంబంధించిన కౌంటర్ ఏర్పాటు చేశారు. అనంతరం వికసిత్ భారత్ వాల్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో యూడీసీ అధికారి యుగేందర్‌రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ బ్రిజున్నీసా, డాక్టర్ ప్రణీత్, డాక్టర్ సౌమ్య, ఇన్‌చార్జి శ్రీనివాస్, ఆధార్ ఇన్‌చార్జి నజీర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ అగ్రిట్రేడర్స్ అధ్యక్షుడిగా వెంకటరమణ ప్రమాణం


ప్రమాణ స్వీకారం చేసిన చేగూరి వెంకటరమణ తదితరులు

చాదర్‌ఘాట్: తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రిట్రేడర్స్ అధ్యక్షుడిగా చేగూరి వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయన బుధవారం మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. తాజా మాజీ అధ్యక్షుడు దేవర రాజేశ్వర్ నూతన అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శి బట్కిరి వివేకానంద్, కోశాధికారి కొనిజేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దుగ్గు జగదీష్, దదువై ప్రకాష్, ఎం.కృష్ణ, సంయుక్త కార్యదర్శులు సత్యలింగం, వెంకటేశం, శ్యాంరావులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు తెలిపారు. ఎస్‌జీఎస్ దామోదర్, వంజరి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంతో మానవ జీవనం మమేకం


'జై కిసాన్- జై భారత్' కార్యక్రమంలో పాల్గొన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు

లక్డీకాపూల్: మానవుని జీవనశైలి వ్యవసాయ రంగంతో మమేకమై ఉందని మమేకమైందని శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం సతీష్ అన్నారు. బుధవారం గడ్డిఅన్నారంలోని శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ 'జై కిసాన్- జై భారత్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు సాయి గీత వ్యవసాయం ప్రాధాన్యతతో పాటు ఆహారపు అలవాట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయా అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ నరేష్, దిల్‌సుఖ్‌నగర్ జోనల్ కోఆర్డినేటర్ జితేందర్, ఆర్ఐ రవీందర్ రెడ్డి, సి బ్యాచ్ ఇన్‌చార్జి సురేందర్ రెడ్డి, స్మార్ట్ లివింగ్ ఇన్‌చార్జీలు సరిత, జ్యోతి, పీఈటీ ప్రవీణ్ కుమార్‌తో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివచరణ్‌రెడ్డికి అభినందనలు


శివచరణ్‌రెడ్డికి ప్రశంస పత్రం అందజేస్తున్న దీపదాస్ మున్షీ తదితరులు

మన్సూరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ పక్షాన ఆరు గ్యారంటీలపై ఇంటింటి ప్రచారం చేసి 14,500 వేల సభ్యత్వాలను నమోదు చేసి రాష్ట్రంలో మొట్టమొదటి స్థానంలో నిలిచిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జక్కిడి శివచరణ్‌రెడ్డికి అభినందనలు వెల్లువిరిశాయి. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ, సీడబ్ల్యూసీ మెంబర్ సయ్యద్ నజీర్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డిలు శివచరణ్‌రెడ్డిని శాలువాలతో సన్మానించి, ప్రశంస పత్రం అందజేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


ప్రగతినగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో చేపట్టుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్థానిక కార్పొరేటర్ వంగ మదుసూధన్‌రెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బుధవారం ఆయన డివిజన్ పరిధిలోని సాయినగర్, ప్రగతినగర్ కాలనీల్లో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ, వరదనీటి కాలువ పనులను సర్కిల్, వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మదుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ, సాయి నగర్ కాలనీలో చేపడుతున్న వరదనీటి కాలువ వల్ల ప్రతి ఏటా వర్షాకాలంలో వచ్చే వరద నీటి ముంపు సమస్యకు చెక్ పడుతుందన్నారు. కాలనీల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల వల్ల కొంత మేర ఇబ్బందులు తలెత్తుతాయని, కాలనీవాసులు సంయమనం పాటిస్తూ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్కిల్ ఏఈ సురేష్, జలమండలి డీజీఎం సరిత, నాయకులు శేఖర్‌గౌడ్, గూడూరు అవినాష్‌రెడ్డి, కృష్ణగౌడ్, అంజి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు బాలరాజ్, పెంటయ్యగౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో డ్రైవర్ల పాత్ర కీలకం


ఉత్తమ డ్రైవర్లను సన్మానిస్తున్న ట్రాఫిక్ సీఐ

లింగోజిగూడ: డ్రైవర్లు లేనిదే దేశ ప్రగతి ముందుకెళ్లదని, అభివృద్ధిలో వారి పాత్ర ఎనలేనిది అని వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ బాలు చౌహాన్ తెలిపారు. డ్రైవర్స్‌డే సందర్భంగా హయత్‌నగర్‌లోని ఆర్టీసీ డిపో 1, 2 లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీలో అన్ని వృత్తుల కంటే డ్రైవర్ వృత్తి చాలా కష్టమైందని అన్నారు. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరవేస్తారని, ఆ పని అంత సులభం కాదని అన్నారు. కార్యక్రమంలో డిపోల మేనేజర్లు విజయ్, శ్రీనివాస్, సహాయ మేనేజర్లు శ్యాం సుందర్, మైస, నరేష్, వీర స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాలలో రాణించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శంకరయ్య

వనస్థలిపురం: ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందని మదర్ థెరిస్సా ఛారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు చేపూరి శంకరయ్య అన్నారు. జాతీయ బాలిక, అంతర్జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మదర్ థెరిస్సా ఛారిటబుల్ సొసైటీ, ఫిట్ ఇండియా ఫౌండేషన్ల ఆధ్వర్యంలో బుధవారం వనస్థలిపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆడపిల్లను పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదివించి ఎదగనిద్దామని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.దీన్‌దయాళ్ మాట్లాడుతూ, ఆడపిల్ల అబల కాదని, సబలని, అవకాశాల్లో సగమని అన్నారు. కార్యక్రమంలో ఫిట్ ఇండియా ఫౌండేషన్ ఇన్‌చార్జి తలారి గణేష్, ఉపాధ్యాయులు శివకుమార్, ఊర్వశి, సరోజ, నాగేశ్వర్, హరికోటి పాల్గొన్నారు.

అయోధ్య ప్రసాదం, అక్షింతలు పంపిణీ

ఎల్బీనగర్: అయోధ్య బాల రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా తన సొంత నిధులతో తీసుకొచ్చిన అయోధ్య ప్రసాదం, అక్షింతలను బుధవారం వైదేహినగర్ నార్త్ ఓనర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోగుల రాంబాబు కాలనీలో ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు.అలాగే కాలనీ సభ్యులు నాగరాజు, లక్క రాజు సహకారంతో కాలనీలోని సాయి బాబా ఆలయం వద్ద కౌంటర్ ఏర్పాటు చేసి పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వంశీ, సురేశ్, శ్రీనివాస్, విద్యాసాగర్

ఇద్దరి పరిస్థితి విషమం

హస్తినాపురం: అతి వేగంగా దూసుకొచ్చిన కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీకొట్టి అవతల వైపు రోడ్డుపై పడిపోవడంతో ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడగా, మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగింది. ఎస్‌ఐ జగన్ తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ ప్రాంతానికి చెందిన సంపంగి సురేశ్ (23) తన ఆటో (టీఎస్31టీఏ8063)లో డ్రైవర్ మజీద్‌తో కలిసి నగరానికి వస్తున్నాడు. దిల్‌సుఖ్ నగర్ నుంచి టి.శ్రీనివాస్ తన ముగ్గురు మిత్రులు శ్రీనివాస్, వంశీ, విద్యాసాగర్‌లతో కలిసి ఇబ్రహీంపట్నం వైపు తన కారు (టీఎస్15యూడీ 7086)లో వెళ్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున రెండున్నర గంటల ప్రాంతంలో ఇంజాపూర్ కమాన్ దగ్గరకు రాగానే కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీకొట్టి అవతలివైపు రోడ్డుపై పడిపోయింది. ఇదే సమయంలో ఇబ్రహీంపట్నం వైపు నుంచి నగరానికి వస్తున్న సంపంగి సురేశ్ ఆటో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంపంగి సురేష్(23), వంశీ (22)ల తలకు తీవ్ర గాయాలు కాగా, శ్రీనివాస్, విద్యాసాగర్, మజీద్‌లకు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని బీఎన్‌రెడ్డినగర్ కాలనీలోని బ్యంగీ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నామని, సురేశ్, వంశీల తలకు తీవ్రగాయాలు కావడంతో వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పారని ఎస్‌ఐ జగన్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మార్చి 31లోపు లైసెన్సులు రెన్యూవల్ చేయించుకోండి

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారం చేస్తున్న వ్యాపారులంతా మార్చి నెల 31 లోపు లైసెన్సులు రెన్యూవల్ చేయించుకోవాలని మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు. మార్చి 31తో లైసెన్సుల రెన్యువల్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో వ్యాపారులంతా తప్పనిసరిగా రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. ఇప్పటికే వ్యాపారులందరికీ నోటీసులు జారీ చేశామని, ఒకవేళ లైసెన్సులు రెన్యూవల్ చేయించుకోకపోతే రోజుకు రూ. 500 ఫైన్ కట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడండి


సమావేశంలో మాట్లాడుతున్న కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అభయ హస్తం పథకాలు పేదలకు అందేలా చూడాలని పార్టీ కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిలు మాట్లాడుతూ... నగరంలోని ఎల్బీ స్టేడియంలో గురువారం రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ పార్టీ బూత్ ఇన్‌చార్జీల సమావేశం జరుగుతోందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ సమావేశానికి మహేశ్వరం నియోజకవర్గంలోని బూత్ ఇన్‌చార్జీలందరూ పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. పీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, కష్టకాలంలో పార్టీ జెండాను మోసి, పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, రాష్ట్ర యువజన నాయకులు చిలక ఉపేందర్ రెడ్డి, హరిపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ గుప్తా, నాయకులు తల్లాటి రమేష్ నేత, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్ యాదవ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టర్స్ కేలండర్ ఆవిష్కరణ

ఎల్బీనగర్: తెలంగాణ విద్యుత్ కాంట్రాక్టర్స్ సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా కేలండర్‌ను బుధవారం ఎల్బీనగర్‌లో బొమ్మరిల్లు హోటల్‌లో ఆవిష్కరించారు.కందుకూరి శ్రీనివాస్, మద్దునూరి వెంకటేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని కేలండర్‌ను ఆవిష్కరించారు. సంఘం సభ్యులు నక్క యాదగిరి, జీసీ రెడ్డి, బెనార్జీ, మహేష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటేష్, మహేందర్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో అభివాదం చేస్తున్న కాంట్రాక్టర్స్

26 నుంచి దేవిత్రయ గీతాజ్ఞాన యజ్ఞం


ఉపముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

లింగోజిగూడ: కర్మన్‌ఘాట్‌లోని శ్రీ లక్ష్మీ కన్వెన్షన్‌లో ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా దేవిత్రయ గీతాజ్ఞాన యజ్ఞాన్ని ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు సూరిశెట్టి శ్రీనివాస్ గుప్తా, సూరిశెట్టి సురేష్, సూరిశెట్టి శశిధర్ తెలిపారు. యజ్ఞానికి హాజరు కావాలని కోరుతూ బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తదితరులను కలిసి నిర్వాహకులు ఆహ్వాన పత్రిక అందజేశారు మూరుకుంట్ల రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ యజ్ఞమహోత్సవం జరుగుతుందని, ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

ఇళ్ల మధ్యలో హాస్టళ్లు, మెకానిక్ షెడ్లు వద్దు

వనస్థలిపురం: కాలనీలోని జనావాసాల మధ్య హాస్టళ్లు, మెకానిక్ షెడ్లు ఏర్పాటు చేసేందుకు భవనాలను అద్దెకు ఇవ్వొద్దని యజమానులను వనస్థలి హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్‌రెడ్డి యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచి కృష్ణమోహన్ కోరారు. కాలనీలో బుధవారం వారం విలేకరులతో మాట్లాడారు. కమర్షియల్ ప్రాంతాల్లో మాత్రమే హాస్టళ్లు, మెకానిక్ షెడ్లకు అద్దెకు ఇవ్వాలని, కాలనీలో హాస్టళ్లు ఏర్పాటు చేయడం వల్ల డ్రైనేజీ, పార్కింగ్ సమస్యలు వస్తున్నాయని, మెకానిక్ షెడ్ల వల్ల రణగొణ ధ్వనులు వస్తుండటంతో కాలనీలో ప్రశాంతత పోతున్నదని అన్నారు. ఈ విషయాన్ని భవన యజమానులు ఆలోచించాలని వారు సూచించారు. జీహెచ్ఎంసీ అధికారులకు సైతం ఈ విషయమై ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.